# రిక్షా

రేపే నా తిరుగు ప్రయాణం. మళ్ళీ ఈ దృశ్యం ఎన్నాళ్ళకో, ఎన్నేళ్ళకో నీటికి సాధ్యమైనంత దగ్గరగా పోయి పొడిగా ఉన్న ఇసుక పొరమీద చతికిలబడ్డాను. ఒడ్డు తాకిన కెరటం నురుగును విడిచి వెనక్కి పోతోంది. పోతూ పోతూ అరికాలి కింద ఇసుకను కోరుకుపోతూఉంటే ఆ వింత స్పర్శకి ఎవరో చిన్న పిల్లలు కిలకిల నవ్వుతున్నారు. నాలుగు దశాబ్దాల్లో నగరం ఎంతగా మారింది! కొన్ని రోడ్లు బాగా విశాలమైపోయి వంతెనలు కట్టేసుకుని ఎత్తుగా ఎదిగిపోయాయి. కొన్ని రోడ్లు ఉదాసీనంగా కిందకి ఒదిగిపోయాయి. కొత్త కొత్త కాంస్య విగ్రహాలూ, శిలా విగ్రహాలూ నిలుచున్నాయి. గుర్రం మీద ఠీవిగా స్వారీ చేస్తున్న తెల్ల దొర విగ్రహం ఏదో మ్యూజియంలోకి పోయిఉంటుంది. నా ముందున్న సముద్రం మానవ స్వభావంలా హోరు వినిపిస్తూ విస్తరించి ఉంది.

జీవనది కాదు కదా - పెద్ద తటాకమైనా లేని కుగ్రామం నాది. అందుకేనేమో పైలాపచ్చీసులో సముద్రాన్ని చూస్తూనే ప్రేమించాను. ఆ ఒడ్డున కాలేజీలో చదువుకునే అవకాశం రాగానే ఉరకలేసింది నా మనసు. నా ఎదురుగా ఇప్పుడు కిలకిలలాడుతున్న పిల్లల్లా నేనూ చప్పట్లు చరిచాను. చీకటి కొట్టులో కూర్చుని కిటికీలోంచి మిణుగురులు చూసి మురిసే ఖైదీని నక్షత్రాలు పొదిగిన ఆకాశం కింద స్వేచ్ఛగా విడిచినట్లయింది. చేపాక్ ప్రాంతంలో మేడమీద చిన్న గది దొరికింది. దానికో బాల్కనీ. గది ఇరుగ్గా ఉన్నా సముద్రానికీ, కాలేజీకీ దగ్గరగా ఉందని సరిపెట్టుకున్నాను.

వాలాజా రోడ్డు చివర ఆటస్థలం. దాని ముందునుంచి పోతే నవాబుల కాలం నాటి పెద్ద కోట. దాన్ని చూస్తూ ముందుకి పోతే సముద్ర తీరానికి సమాంతరంగా సాగే బీచ్ రోడ్డు. నీటిమీంచి వెర్రిగాలి నన్ను ఎగరగొట్టేలా వీస్తూఉంటే, ఆ బీచ్ రోడ్డులో పడి కుడి చేతివేపు కాసింత నడిస్తే నా కాలేజీ. ఈ చిన్న పాదయాత్ర నాకిచ్చే ఆనందం ఇంతా అంతా కాదు.

కానీ, ఆ దారిలో అప్పుడప్పుడు తారసపడి, నాతో కొంత దూరం వచ్చే ఒక లాగుడు రిక్షా నా కంటిలో నలుసులా, పంటికింద రాయిలా బాధించి ఈ ఆనందాన్ని హరించేసేది. ఆ పాత రిక్షా, దానిలోని బరువుకి కిర్రు కిర్రున మూలుగుతూ బీచ్ రోడ్డు దాకా వచ్చి

ఎడమవేపు తిరిగి యూనివర్సిటీ దిశగా పోయేది. అప్పటికి ట్రాంబళ్లు తిరగడం మానేశాయి. లాగుడు రిక్షాలు మాత్రం నగరమంతా స్వైర విహారం చేస్తూ రోడ్లమీద, సందుల్లో, గొందుల్లో కనిపించేవి. నిజానికి లాగుడు రిక్షా ఏమంత అసాధారణ దృశ్యంకాదు. వాటిని లాగేవాళ్లు కుర్రకారు యువకులూ, దృఢమైన నడివయసు వాళ్లూ. ఏదో సినిమా పాట కూనిరాగంగా తీస్తూ 'ఇది నా వృత్తి ధర్మం, నా బ్రతుకు తెరువు' అన్నట్లుగా బరువును రెండు చక్రాల మీదా సునాయాసంగా బాలెన్స్ చేసుకుంటూ సాగిపోయేవారు.

మరి నే చెప్పిన రిక్షా వేరు. రెండు వైపరీత్యాలను కలిపే వారధిలా ఉండేది. ఒక వెంట్రుకైనా లేకుండా, ఎండకి నల్లగా మాడిపోయిన నున్నటి గుండు, రెండు గుండీలు ఊడిపోయి ఎండిన గుండెల్ని చూపిస్తున్న పాత కాకీ రంగు కోటు, ముణుకులు దిగీ దిగని గళ్లలుంగీ, మోకాలి పిక్కల మీద ఉబ్బి స్పష్టంగా కనిపిస్తున్న నరాలు, బోసినోటిలో తిరిగే తమలపాకు రసంతో మొద్దుబారిన ఎర్రటి నాలుక - ఇవి స్థూలంగా రిక్షాను లాగేవాడి స్వరూపానికి సంకేతాలు. రిక్షా దండీని చేతులతో పదిలంగా పట్టుకుని ఆ వాహనంలో ఇరుక్కుపోయిన ఒక పర్వతాకారాన్ని ప్రాణం కన్నా మిన్నగా మోస్తూ, నడకలాంటి పరుగుతో, పరుగులాంటి నడకతో వెన్నుపూసను ఒంచుకుంటూ ముందుకు సాగిపోయేవాడు.

అందులో నిర్వికారంగా ఇరుక్కున్న స్థూలకాయంలో ఎక్కడన్నా కాసింత హృదయమనే వస్తువు ఉందా అని సందేహం కలిగేది. గోధుమ వర్ణం, బాన కడుపూ, రెండు చేతుల్నీ కప్పుతూ వేళ్లనుమాత్రం చూపించే కావిరంగు తేరిన పొడుగాటి లాల్చీ, దానిమీద క్రాస్ బెల్ట్ లాగ చుట్టి ఒక కొసను ఎడం భుజం మీద నుంచి వెనక్కు వదిలేసిన రంగు వెలిసిన కాశ్మీరు శాలువ, బట్టతల మీద కాసిన్ని వెండి వెంట్రుకలు, తెల్లగా మెరిసే గుబురు మీసాలు, 'నే నెరగని లోకమా ఇది' అని చూస్తున్న కళ్లు, వాటిమీద దట్టమైన తెల్లని కనుబొమలు... ఇవి రిక్షాలో కూర్చున్న వ్యక్తిని సుమారుగా చిత్రించడానికి సరిపడే గుర్తులు.

ఆ రిక్షా నా కంట పడగానే 'లాగుడు రిక్షాల్ని ఎందుకు నిషేధించరో ఇంకా' అనుకునేవాణ్ణి. నా ఆలోచనలు ఆ రిక్షా చుట్టూ తరుచూ తిరిగేవి. తమాషాకి ఆ స్థూలకాయుడు ఒక కొండచ్రావు అయి ఉంటాడనీ, ఆ రిక్షా లాగేవాడు ఏ ఆర్ముగమో అయి ఉంటాడనీ ఊహించి నా మనసులో నామకరణం చేసుకున్నాను. ప్రాణాలుగ్గబట్టి రిక్షా లాగుతున్నట్లు నాకు కనిపించే ఆర్ముగం నోరు ఎన్నడూ మూతబడి ఉండడం నేనెరగను. దండికి వేసి కొట్టే మువ్వల సవ్వడితో శ్రుతి చేస్తూ ఏదో మాట్లాడుతూనే ఉండేవాడు. దానికి రిక్షాలోంచి బరువైన జీరగొంతు ప్రతిస్పందించేది. ఇద్దరూ నగరానికి పాతపడ్డ ఉభయ భాషా ప్రవీణులే. తమిళంలా వినిపించే తెలుగులోనూ, తెలుగులా వినిపించే తమిళంలోనూ మణి ప్రవాళ కావ్యంలా ఆ సంభాషణ సాగేది. నాకు వినపడేది.

కాలేజీలో ఏవో వేడుకలూ, ఉత్సవాలు జరుపుకున్నాం. ప్రిన్సిపల్‌గారు నన్ను పిలిచారు. వారి గదిలో కూర్చున్న అతిథులకి కాఫీ అందించి తర్వాత ఆడిటోరియంలోకి వాళ్లని తీసుకెళ్లి మొదటి వరుసలో కూర్చోబెట్టమని బాధ్యత అప్పగించారు. వాళ్లలో బరువుగా కూర్చున్న కొండల్రావుని చూశాను. ఆనాటి కార్యక్రమంలో శ్రోతల్ని ఆకట్టుకుని శ్రావ్య సంగీతంలా సాగిన ప్రసంగం అతనిదే. పదిహేను నిముషాలే మాట్లాడినా 'విశ్వసాహిత్యంలో మానవతా వాదం' అన్న ప్రసంగంలో లియో టాల్‌స్టాయి, చార్లెస్ డికెన్స్, విక్టర్ హ్యూగో వంటి రచయితల ప్రసక్తి చేసి కూర్చున్నాక ఆడిటోరియం కరతాళ ధ్వనుల్తో మారు మ్రోగిపోయింది. నా ఒంటికి పచ్చికారం రాసుకున్నంత అయింది. అవకాశం దొరికితే అతణ్ణి నిలదీసి కడిగెయ్యాలనుకున్నాను ఆ రోజే.

నా బాల్కనీ మీద నిలుచుంటే వీధిలోని గడపలు చాలా వరకూ ఒక కోణంలో వింతగా కనిపించేవి. అన్నీ పాతకాలం కట్టడాలే. ఇంటి ముందు ఎత్తయిన అరుగు ప్రతీ ఇంటికీ ఉంటుంది. అది ఎక్కగానే రంగూన్ టేకుతో మలిచిన పెద్ద ద్వారం. దానికి బరువైన ఒంటి రెక్క తలుపు. వీధి చివరలో అలాంటి ఒక గడప ముందు నేలని మొక్కుతున్నట్లు రిక్షా దండిని ఆనించి ఒక ఉదయం ఆర్ముగం కనపడ్డాడు. చేతిలో ఉన్న తమలపాకుని చుట్టచుట్టి నున్నటి రాయితో దాన్ని మోది ఆ గుజ్జును ఆప్యాయంగా బోసి నోటిలో కుక్కుకుంటున్నాడు. పిల్లచేష్టగా నాకో చిలిపి కోరిక కలిగింది. ఆ ఉదయం ఆర్ముగం రిక్షాని కొండల్రావుకి అందకుండా చెయ్యాలనుకున్నాను. కాలేజీకి వెళ్లే సమయమే అది. వేగంగా స్నానం చేసి బట్టలేసుకుని రిక్షా దాకా వెళ్లాను. 'ప్రెసిడెన్సీ కాలేజీకి శీఘ్రమా పోణుం రెండ్రూపా కుడుకురే...' అని కాసింత ఒంటబడుతున్న కొత్త భాషలో ప్రలోభపెట్టాను. ఎంతటి ఉదారులైనా అప్పట్లో ఆ దూరానికి అర్ధ రూపాయో, ముప్పావలానో ఇస్తారు. 'ఏరుంగో' అని ఎగిరి గంతేస్తాడనుకుంటే, 'ఇల్లే సామీ... ఆళు...' అంటూ కూర్చున్నవాడు లేవకుండా నసిగాడు.

నేను ఉడుక్కున్నాను. వర్గ పోరాటం గురించి ఇలాంటి వాడికి ఏమని చెప్పడం - వీణ్ణి ఎలా బాగు చెయ్యగలం అనుకున్నాను. నేను నా గదికి పోయి ఏవో బట్టలుంటే లాండ్రీలో ఇచ్చి నా దారిని కాలేజీకి పోతున్నాను. నా వెనక మువ్వల మోత. అదే రిక్షా. అదే దృశ్యం. వీళ్ల మధ్య ఏదో నెలవారీ కాంట్రాక్ట్ ఉండి ఉంటుందనుకున్నాను.

ఒక ఆదివారం సాయంత్రం సముద్రానికి దగ్గరగా పొడి ఇసుక మీద అడ్డంగా ఒడ్డు వెంబడి పోతున్నాను. ఒక చేపల పడవని ఆనుకుని కొండల్రావు కూర్చున్నాడు. ఎలాగైనా మాటలు కలపాలని ఒక నమస్కార బాణం విసిరి ఎదురుగా కూర్చున్నాను. సుండల్ పొట్లం చేత్తో పట్టుకుని ఆరేళ్ల పాప ఇసుక మీద గీసిన బొమ్మను చూపించి "తాతా! తాతా!"

అంటూ స్పష్టమైన తెలుగులో ఏదో అడుగుతోంది. ఆ పాపకు సమాధానం చెప్పిన కొండ(త్రావు నావేపు చూసి "హల్లో యంగ్‌మన్..." అన్నాడు పలకరింపుగా.

"తరచూ వాలాజా రోడ్డు చివర చూస్తూ ఉంటాను" అన్నాను - ఎలా ప్రారంభించాలో అర్థంకాక.

"అవునవును... నాకూ అదే జ్ఞాపకం. ఈ మధ్య మీ కాలేజీ ఫంక్షన్‌లో కూడా..." అని నా కళ్లలోకి చూశాడు. అలా నా చదువు, పుస్తకాలు, ఇతర విషయాలు మా మధ్య దొర్లినతర్వాత నాలో తగ్గిపోతున్న తెగింపును కూడగట్టుకుని "మీ ఉపన్యాసం... బాగుంది... కానీ..." అని మాట పెగలక ఊరుకున్నాను.

"ఓహ్! నీకు నచ్చిందా? సంతోషం. థాంక్యూ" అన్నాడు. ఒక్క క్షణం వ్యవధి తర్వాత "కానీ అని ఊరుకున్నావేం?" అని నిలదీశాడు. ఇక నాకు తప్పలేదు. "మీరు వివరించిన మానవతా వాదానికీ, మీ రిక్షా ప్రయాణానికీ పొంతన లేదు" అనేశాను. అనేసి తల దించుకున్నాను. అంత పెద్ద మనిషిని అలా అనడంలో కలిగిన ఇబ్బందికి తట్టుకోలేక నెమ్మదిగా తలెత్తాను. మొహం కాస్త మాడ్చుకుంటాడనుకున్నాను. నిండు కుండలా నన్ను చూసి చిద్విలాసం చేశాడు.

"ఓహ్! వండ్రఫుల్ యాంగ్రీ యంగ్‌మన్ యూ సీమ్ - టు - బి" అని నవ్వితే అతని కళ్లు రెండూ మూసుకుపోయి రెండు అడ్డగీతలుగా మారిపోయాయి. జేబులోంచి గడియారాన్ని తీసి చూసుకొని "ఎగ్మూర్ పోవాలి - రేడియో టాక్ ఉంది... ఇంకోమారు కల్సుకుందాం" అని మనవరాలి చెయ్యి అందుకుని పర్వతంలా కదలిపోయాడు. పీపాలాగ దొర్లిపోయాడంటే బావుంటుందేమో!

ఎప్పుడైనా అతను ఇసుక మీద కనుపించేది ఆదివారాలు సాయంత్ర సమయంలోనే. నా చదువూ హడావిడిలో మళ్లా తిరిగ్గా అతన్ని కలుసుకునే అవకాశం మరో నెల రోజులకి కానీ రాలేదు. అప్పటికి నాలో ఆ రిక్షా మీద ఉత్సాహం కాస్త సన్నగిల్లి మౌనంగా కూర్చుంటే అతనే వక్క పలుకు నములుకుంటూ "మానవ సంబంధాలూ, స్నేహాలూ ఒక్కొక్కప్పుడు తర్కానికీ, సిద్ధాంతానికీ లొంగనట్లుంటాయి. ఆ రిక్షా వాడితో నా పరిచయం చాలా నాటకీయంగా జరిగింది సుమా" అంటూ ఎప్పుడో అర్థాంతరంగా తెగిపోయిన మా సంభాషణను అందుకున్నాడు.

వింటున్నాను.

"నేను ఇంటి నుంచి యూనివర్సిటీకి నెమ్మదిగా నడిచి వెళ్లడం, రావడం నా భారీ శరీరానికి అలవాటు. డాక్టర్ కూడా నడక మంచిదని పదే పదే హెచ్చరించేవాడు. ఎప్పుడూ పుస్తకాలతో గడిపే నాకు కాస్త నడిచే అవకాశం అదొక్కటే. ఒక సాయంత్రం నా కుడి కాలి

బొటనవేలికి బలంగా దెబ్బ తగిలింది. కాలి చెప్పుకి ఉన్న ఉంగరం కూడా తెగిపోయింది. వాన వచ్చేటట్టుంది. రెండు బస్సుల్ల మీద ప్రయాణం చేసినా బస్సు ఇంటిదాకా రాదు. ఏం చెయ్యాలో తోచక రిక్షా కోసం ఎదురుచూస్తూ ఉంటే మువ్వలు చప్పుడు చేస్తూ "ఏరుంగో..." అన్నాడు. వాడివేపూ, వాడి రిక్షా వేపూ అపనమ్మకంగా చూస్తూ వద్దు అని చేత్తో సౌజ్ఞ చేశాను. వాణ్ణి వదిలించుకుందామని రెండడుగులు కుంటుతూ ముందుకి వేశాను. వాడు ఎంతో అవమానంతో కుంగి పోయినట్లున్నాడు.

"నీకన్నా బరువైన వాళ్లని మోశాను" అన్నాడు చిన్నగా నవ్వుతూ. ఆ నవ్వులో విషాదం అంతర్లీనంగా ఉంది. అది నా మనసులో ఎక్కడో సున్నితంగా తాకింది. ఎవరైనా చూస్తారన్న బిడియం పక్కకు నెట్టి ఆ రిక్షాలో ఇరుక్కున్నాను. దండిని నెమ్మదిగా ఎత్తి ఎంతో అనుభవజ్ఞుడిలా నిబ్బరంగా పోనిచ్చాడు. మధ్య మధ్య జోకులు వేశాడు. నా ఉద్యోగం, నేను వచ్చే పోయే వేళలు అడిగాడు. ఇంటిముందు దింపాడు. 'బ్రతికేనుపో' అనుకుని నా జేబులో చెయ్యి పెట్టి నాలుగు రూపాయల నోట్లుంటే తీసి వాడి చేతిలో ఉంచాను. వాటిని అందుకున్నట్లే అందుకుని మూడు కాగితాలు తిరిగి నా చేతికి ఇస్తూ, "నీకు జాలి ఉంటే ఇలా చూపించకు" అన్నాడు. నేను అవాక్కయి నిలబడ్డాను. వాడు వెళ్లిపోబోతూ ఏదో చెప్ప మరచినట్లు ఆగి చిన్న పాఠంలా వల్లించాడు.

"ఈ కట్టెలో గాలి ఉన్నంత వరకూ ఆకలి తప్పదు. నేను ముసలాడినని అంతా నా రిక్షాని వెలివేస్తే నే నెలా బతకాలి? నా తిండికి సరిపడ్డ ఆర్జన చేతికివ్వందే నా కోడలు ఏం పెడుతుంది? ఎందుకు పెడుతుంది? అలవాటు పడ్డ కష్టం మాని కొత్త బతుకు నాకు ఈ వయసులో కుదురుతుందా? సాయంత్రం దాటితే నాకు చూపు ఆనదు. నా వయసుకి దగ్గరగా వస్తున్న వాడివి నువ్వే నా కష్టం తెలుసుకోకపోతే చిన్నవాళ్లకి ఏం చెప్పేది" అని గుక్కతిప్పుకోకుండా ఒక్క మాటైనా తడుముకోకుండా చెప్పాడు. ప్రతి వాక్యంలో కసీ, ఆవేదనా వినిపిస్తున్నాయి. రిక్షాని తీసుకుపోతూ - "నా రిక్షా ఎక్కవనుకున్నా, ఎక్కేవు. అదే పదివేలు" అన్నాడు. రాత్రి వాడి మాటలే పదే పదే నా చెవుల్లో రింగు మన్నాయి.

"మర్నాడు ఉదయం మనవరాల్ని పిలిచి 'ఏదైనా రిక్షా పిలుచుకురావే' అన్నాను. ఒక్క క్షణంలోనే తిరిగి వచ్చేసింది. నిన్నటి రిక్షా తాత గుమ్మంలోనే ఉన్నాడంది. 'అయ్యబాబో మళ్లా అవతరించాడా నా గడపలో' అనుకున్నాను. నన్ను చూస్తూనే - "నీ కాలు నొప్పి తగ్గేదాకా నిన్ను తీసుకెళ్లి తీసుకొస్తాను" అన్నాడు సాధికారికంగా. 'సరే' అన్నాను. అలా సాగిన ఏడు రోజుల ప్రయాణంలో నా కథ విన్నాడు. వాడి కథ చెప్పాడు. నాలోని ప్రతిస్పందనకు స్నేహమని పేరు పెడతావో, ఆరాధన అంటావో నాకు తెలియదు. కానీ వాడు చేసిన ప్రతిపాదన కాదనలేని బలహీనత నాలో ప్రవేశించింది. ఆధునిక సిద్ధాంతాలు

ఏవీ నాకు గుర్తు రాలేదు. వాడి శ్రమకి ఏం విలువ కట్టానో, నేనేం పారితోషికం ఇచ్చానో, నాలో వాడు ఎలాంటి ఆకర్షణకు లోనయ్యాడో ఇప్పుడు అప్రస్తుతం. వాడు నన్ను రోజా యూనివర్సిటీకి తీసుకెళ్లడం ఇంటి దగ్గర మళ్లా విడవడం వాస్తవమైపోయింది. వాడి మొహంలో ఏదో తృప్తీ, ఏదో వెలుగూ చూశాను. నాలో కూడా అలాంటి దేదో ఉండే ఉంటుంది. డాక్టర్ తరచూ ఇచ్చే సలహాలు పక్కకు నెట్టి ఉషోదయం కోసం ఋషి ఎదురు చూసినట్లు రిక్షా కోసం ఎదురు చేసేవాణ్ణి. అయితే ఒక్కటే ఇబ్బంది ఉండిపోయింది." ఇలా చెప్పి కొండల్రావు కాసింత ఆగి తన సంచిలోంచి వక్కపొడి తీసి నోట్లో వేసుకున్నాడు.

ఉత్కంఠతో వింటూ "ఏమిటా ఇబ్బంది?" అని అడిగాను.

"మరేం లేదు, దారిలో నీలాంటి యాంగ్రీయంగ్‌మన్ చూపులూ, విసవిసలూ తట్టుకోవాలి కదా!" అన్నాడు - నా కళ్లలోకి సూటిగా చూస్తూ.

ముసలాయన చాలా మాటకారి, చమత్కారి అని నాలో ఏదో సందేహంతోనే సరిపెట్టుకున్నాను. అయినా ఆనాటినుంచీ కాస్త చిక్కబడ్డ స్నేహం, పరిచయం కారణంగా ఆ రిక్షా నాతో కొంత దూరం కలిసి నడిచినప్పుడు ఒక నమస్కారం, ఒక పలుకరింపూ రివాజుగా అయిపోయింది. ఆర్ముగం కూడా ఎక్కడైనా రిక్షాతో ఎదురైతే - 'ఏన్నా అప్పా సౌఖ్యమా' అనే వాణ్ణి. వాడు కూడా ఎంతో పొంగిపోయేవాడు.

ఒక ఉదయం నాకు రిక్షా తటస్థ పడలేదు. మధ్యాహ్నం క్లాసులు లేవు. అలా రాయపేట వెళ్లి వస్తూనే ఆ వీధి మొదట్లో ఉన్న ఇంటి వేపు చూశాను. అరుగు మీద కోటు విప్పి కుచేలుడులాగ కూర్చున్నాడు ఆర్ముగం. పింగాణీ కప్పు ఎత్తి ఏదో గొంతులో పోసుకుని రుచిని అస్వాదిస్తున్నాడు. వాడి ముందు అరటాకులో గారెలు ఉన్నాయి. కొండల్రావు ఎదురుగా నిల్చుని ఏవో ఛలోక్తులు విసురుతున్నాడు. మర్నాడు ఉదయమే ట్రిప్లికేన్ హైరోడ్డులో ఆర్ముగం కనిపిస్తే "ఏమప్పా నిన్న నీ జాడ లేదు" అని అడిగాను. "నిన్న పెద్దాయన తండ్రికి ఆరాధన చేసి నాకు ప్రసాదం పెట్టారు. ఇక మేం పోలేదు" అన్నాడు.

మళ్లా కొన్ని రోజులదాకా నా పరీక్షల కారణంగా మేం తీరికగా మాట్లాడుకోలేదు - దారిలో ఏదో రివాజుగా పలకరింపు తప్ప. ఒక ఆదివారం సాయంత్రం చూపుడు వేలితో ఇసుకలో అంకెలు వేసి కొండల్రావు మనవరాలి చేత పలికిస్తున్నాడు. నేను వెళ్లి ఎదురుగా కూర్చున్నాను. "ఇంతకీ క్రిందటిమారు మనం అసలు కథలోకి అడుగు పెట్టనే లేదు కదూ" అన్నాడు అతనే చొరవ తీసుకుని. మనవరాలు లేచి అటూ ఇటూ పరుగుతీస్తున్న పీతలను వెంబడించి ఆడుకుంటోంది.

"నా భార్య పోయి పదిహేనేళ్లయింది. కొడుకూ, కోడలే ఆధారం. కాలూ, చెయ్యీ స్వాధీనం కాకపోతే నన్ను ఇక వాళ్లే చూడవలసిన వాళ్లు. మరి నాతో పాటు అదనంగా ఇంకో ముసలివాడి బాధ్యత వెయ్యలేను కదా. ఏమంటావు" అని నన్ను ప్రశ్నించాడు. 'ప్రొఫెసర్

అసాధ్యుడే, ఎక్స్‌రే కళ్లు కావు కదా' అనుకుని ఆ ప్రశ్నకు నా భుజాలు తడుముకున్నాను నాలోని సందేహానికి అది జవాబు.

"ఆ రిక్షావాడు యువకుడుగా హార్బర్ ప్రాంతంలో ఇంకొకడితో కలిసి పెద్ద పెద్ద బరువులు బండిమీద పెట్టి లాగుతూ చాలా సంపాదించేవాడట. ఆ ఉమ్మడి సంపాదన అంతా మూటకట్టుకుని ఆ రెండోవాడు కాస్తా ఉడాయించేశాడు ఐపులేకుండా. ఆ దెబ్బనించి కోలుకున్నాక మనుషుల మీద నమ్మకమే పోయినట్లు ఒంటరిగా రిక్షా లాగుతూ బతికేవాడు. అలా ముప్పై దాటినా పెళ్లీ పెటాకులూ లేకుండా యాంత్రికంగా బతుకుతూ ఉంటే ఒక సాయంత్రం వీడి రిక్షా ఎక్కిన ఒంటరి ఆడపిల్ల, దొరకని ఇంటి నంబరు వెతుక్కుంటూ కోడంబాకంలో వీధి వీధి తిప్పి ఎక్కడి కెళ్లాలో అర్థంకాక వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుంది. ఆ పిల్ల చెప్పినది విన్నాక వీడి మనసు కాస్తా ద్రవించిపోయింది. ఎవడో ఆ పిల్లకి ఆశపెట్టి, మోసపు మాటలతో మద్రాను తీసుకొచ్చి నగా నట్రా ఖర్చు పెట్టేసి ఇప్పుడే వస్తానని ఒంటరిని చేసి ఎక్కడో వదిలేశాడు. వాడు ఇచ్చిన ఒక తప్పుడు అడ్రసు పట్టుకు అలిసిపోయింది. ఇంటికి తిరిగి పోనంది. పోలీసులకు రిపోర్టు ఇవ్వద్దంది. ప్రేమకు నోచుకోని వీడి మనసులో ఆ పరిస్థితిలో ఔదార్యం వెల్లువలా పారింది. ఆ పిల్ల వీడితోటే ఉండిపోయింది. మోడుబారిన ఒంటరి జీవితంలో మొదటిసారిగా రుచీ, మాధుర్యం నిండాయి. కాని ఆ ఆనందం మూడునాళ్ల ముచ్చటే. రెండేళ్ల తర్వాత ఒక మగపిల్లవాణ్ణి కని ప్రసవంలోనే కన్ను మూసింది. సాహిత్యాలు వల్లెవేసి సిద్ధాంతాలూ, శాస్త్రాలు చదివే యువకులెందరికి అలాంటి ఔదార్యం, చొరవా సాధ్యం?'' అలా ప్రశ్న వేసి కాస్తంత ఆగి నా కళ్లలోకి చూశాడు కొండల్రావు. 'ఆ ప్రశ్న కేవలం నా కోసం వెయ్యలేదు కదా' అని కలవరపడ్డాను - ఒక్క క్షణం. ఇంతలో మిగిలిన కథ కుపక్రమించాడు.

"మళ్లా పెళ్లిమాట తలపెట్టకుండా ఆ పసి వెధవని పెంచాడు. గుడిసెల్లో ఉన్న ఆడవాళ్లని బతిమాలుకుని మరీ ఆ పసిగుడ్డుని ఎన్నో అవస్థలు పడి పెంచాడు. పెద్ద చేసి పెళ్లి కూడా చేశాడు. పెళ్లయి రెండు మూడేళ్లయినా కాకుండా ఆ కొడుకు రోడ్డు ప్రమాదంలో పోయాడు. ఈ దురదృష్టం చాలదన్నట్టు ఆ కోడలికీ, వీడికీ పడలేదు'' అన్నాడు కొండల్రావు.

"ఇంక ఆ కోడలి పంచనే పడి ఎందుకుండాలి? ఒంటరిగా బతక్క...'' అన్నాను విసుగ్గా నేను.

"దానికో ఆడపిల్ల పుట్టింది. వీడి జీవితంలోకి ప్రవేశించి మూణ్ణాళ్ల ముచ్చటగా పోయిన పిల్లలాగే మూడు మూర్తులా ఉంటుందట - ఆ మనవరాలు. ఆ అమాయకురాలు మళ్లీ వీడికోసం పుట్టిందేమో అన్నంత పోలికలున్నాయట. ఆ తృప్తికోసం సాయంత్రం గూడు చేరి ఆర్జించినదేదో ఇచ్చి బతుకుతున్నాడు'' అని రిక్షావాడి చరిత్రని సంక్షిప్తంగా కొండల్రావు

పూర్తి చెయ్యగానే అన్ని వివరాలు సేకరించిన అతని ఉత్సుకతని తలుచుకుని ఆశ్చర్యపోయాను.

చాలా రోజుల తర్వాత బరువుగా అడుగులేసుకుంటూ ఒక ఉదయం నడుచుకుపోతున్న కొండ్రావుని చూశాను. "నమస్కారం! ఇవాళ వాహన యోగం లేదేమిటి?" అని కాస్త హాస్య ధోరణిలో పలకరించాను.

"వాడికి జ్వరం" నిస్తేజంగా జవాబిచ్చేడు.

"మీకెలా తెలిసింది" సందేహంగా అడిగాను.

"ఇంకేదన్నా కారణమైతే ఉదయమో, సాయంత్రమో ఒకమారు చూసిపలకరించకుండా ఉండడు. అందుకే నిన్న వాడి గుడిసె వేపు వెళ్లి చూసి వచ్చాను" అన్నాడు.

ఇలాటి అనుబంధం నన్ను మరింత ఆశ్చర్యంలో ముంచేసింది. ఆ ఆశ్చర్యాన్ని ప్రకటించడానికి మనసొప్పక తేలికగా మాట్లాడుతూ- "ఈ నడక మీ ఆరోగ్యానికి మంచిదేనేమో" అన్నాను. "నా ఆరోగ్యం కోసం వాడికి జ్వరం రావాలా?" అనుకుంటూ యూనివర్శిటీ దిశగా మళ్లిపోయాడు.

చలి కాస్త ఎక్కువగానే ఉంది. సంక్రాంతి సెలవులకి మా గ్రామం వెళ్లాను రెండవరోజు ఉదయం వార్తాపత్రికలో ప్రముఖ విద్యావేత్త డా॥ దయాసాగర్ మరణవార్త, అచ్చయిన ఫోటో చూస్తూనే 'అయ్యో ఎంత పని' అనుకున్నాను. నేనెప్పుడో వ్యంగ్య ధోరణిలో అతని స్థూలయాయాన్ని చూసి పెట్టుకున్న పేరు కన్నా అతనికి పెద్దలు చేసిన నామకరణమే ఎంతో అతికినట్లు సరిపోయిందనుకున్నాను.

తిరిగి నగరానికి వెళ్లిన వారంరోజుల తర్వాత హిందూ హైస్కూలు దగ్గర రిక్షా నిలిపి పరధ్యాన్నంగా కూర్చున్న ఆర్ముగం కనిపించాడు. ఆ మొహంలో నే చూసిన వెలుగు, ఉత్సాహం లేవు. నన్ను చూస్తూనే ఆర్తిలో ఉన్నవాడు ఆప్తుణ్ణి చూసినట్లు భోరుమన్నాడు. ఏం చెయ్యాలో, ఎలా ఓదార్చాలో అర్థంకాక అలా నిలబడిపోయాను. తెరలు తెరలుగా వస్తున్న దుఃఖాన్ని ఆపుకుని మాట్లాడే ప్రయత్నంచేస్తూ ఆకాశంలోకి చూపిస్తూ రెండుచేతులూ ఎత్తి నమస్కారం చేశాడు. రంగు వెలిసినట్లున్న కాశ్మీరు శాలువ పాతబడి వాడి రెండు భుజాల్నీ కప్పుతోంది.

అన్యాయానికి ప్రతీక అని నేను ఏవగించుకున్న లాగుడు రిక్షాని ఇప్పుడు అన్నిచోట్లా నిషేధించారు. కానీ రెండువర్గాల వ్యక్తులమధ్య ప్రేమకి వారధిగా నా జ్ఞాపకాల్లో ఇంకా ఆ రిక్షా మిగిలిపోయింది. "మేధ, మనసూ కలవందే జీవితానికి సమగ్రత లేదేమో" అనుకుంటూ ఇసుకను దులుపుకుని లేచి నిలబడ్డాను. చీకటి చిక్కబడి విద్యుద్దీపాలు మసగ్గా మిలమిల లాడుతున్నాయి. సముద్రపు హోరు ఎక్కువై వినిపిస్తోంది.

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక)
ఆగస్టు 18-24, 1993